క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం


చతుర్వేద పారాయణంలో అర్చక స్వాములు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండపై శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని రాత్రి ఏడు గంటలకు శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణ, భగవద్గీత పారాయణతో పాటు భక్తి సంకీర్తనల ఆలాపన జరిగాయి. జూన్ 15 నుంచి 19 వ తేదీ వరకు జరిగే శ్రీ గిరి వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

200 మందికి మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న టీం సభ్యులు

కొత్తపట్నం: గత నాలుగు రోజులుగా వడగాల్పులు.. తీవ్ర ఉష్ణోగ్రతలు పెరిగినందున మదర్ థెరిస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు మంగళవారం పంపిణీ చేశారు. కొత్తపట్నం నుంచి ఒంగోలు వెళ్లే ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులను ఆపి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నున్న కట్టీ పుట్టిన రోజు సందర్భంగా ఆయన సొంత నిధులతో మజ్జిగ ప్యాకెట్లుకు అయ్యే నగదును బహుకరించారు. టీం సభ్యులు ఆర్గనైజర్ డి.కేశవ, ఎం.సునీల్, ఎం.రాజ్ కుమార్, ఎం.సన్నీ, ఎం.ప్రసాద్, ఎం.ప్రేమ్ కుమార్, డి.సుజీత్ పండు పాల్గొన్నారు.

ప్రశాంతికి సేవా పురస్కారం


జాతీయ పురస్కారం అందుకుంటున్న ప్రశాంతి (ఫైల్)

కొత్తపట్నం: సామాజిక ప్రజా గాయకురాలిగా, సాంఘిక సేవా కార్యక్రమాలతో పాటు జై భీమ్ క్యాన్సర్ ఇమ్యూనిటీ ఫౌండేషన్ స్థాపించిన పి.ప్రశాంతికి జాతీయ పురస్కారం లభించింది. బడుగు, బలహీన మహిళలకు చైతన్య పరుస్తూ ఓ స్త్రీ మేలుకో అనే నినాదంతో సేవలు అందించినందుకు ఈ గుర్తింపు దక్కింది. కొత్తపట్నం గ్రామానికి చెందిన బద్దిపూడి ప్రశాంతి పేద కుటుంబంలో పుట్టి పేదరికంతో అనుభవిస్తూనే సామాజిక సేవలో విలీనం అయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాల్లో మహిళకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ఎంతో మందిని కాపాడగలిగారు. దీంతో ఇటీవల తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా జాతీయ పురస్కారం అందుకుంది. చైర్మన్ పోల్‌రాజ్‌కుమార్ ఆమెతో పాటు ఆమె తల్లిదండ్రులు బద్దిపూడి ప్రేమానందం, ప్రభావతిని అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొనకనమిట్ల: ఎన్నికల ఎన్నికల కౌంటింగ్ రోజున ఎవరైనా గ్రామాల్లో అల్లర్లు సృష్టించి గొడవలకు కారణమవుతారో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మాధవ రావు అన్నారు. మంగళవారం కొనకనమిట్ల, గొట్లగట్టు గ్రామల్లో రాజకీయపార్టీల నాయకులతో పాటు ప్రజలతో సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని అన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో దుకాణాలను తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా దుకాణాల్లో క్రాకర్స్ అమ్మకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పలు వాహనాలను తనిఖీ చేశారు.

మార్కాపురం: మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలో లా అండ్ ఆర్డర్‌కు ప్రజలందరూ సహకరించాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం ఉదయం పట్టణ శివార్లలోని పూలసుబ్బయ్య కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించి అనుమతి లేకుండా ఉన్న పది బైకులను సీజ్ చేసినట్లు తెలిపారు. యువతకు, కాలనీవాసులకు కౌన్సెలింగ్ చేశారు. కౌంటింగ్ అనంతరం ఎవరైనా గొడవలు చేసినా.. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కంభం: కందులాపురం పంచాయతీ పరిధి పూసల బజారులో మంగళవారం ఉదయం సీఐ జె.రామకోటయ్య ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేశారు. పోలీసులు ప్రతి ఇంటిని జల్లెడ పట్టి సరైన ధృవపత్రాలు లేని 7 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పోలీసుల గస్తీ పెరిగిందని సీఐ తెలిపారు. గ్రామాల్లో ప్రజలు సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరైనా అనవసరమైన గొడవలకు దిగినా, ఇతర వర్గాల వారిని రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన ధృవీకరణపత్రాలు సమర్పించి వాహనాలు తీసుకెళ్లాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి
తక్షణ చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు

ఒంగోలు: నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇంజనీర్లు తక్షణ చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ యం.జస్వంతరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కమిషనర్ ఛాంబర్‌లో ఆయన అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీర్లు ప్రతిరోజు తమ తమ పరిధిలో సంచరిస్తూ మంచి నీటి సరఫరా విషయంలో వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఏదేని ప్రాంతాల నుంచి నీటి సరఫరా విషయంలో అవాంతరాలు వచ్చినట్లయితే ఆ విషయాన్ని సంబంధిత ప్రాంత ప్రజలకు తెలియజేయడంతోపాటు అవసరమైన మేరకు మంచినీటి ట్యాంకర్లను సమకూర్చాలన్నారు. దిగువ స్థాయి సిబ్బందితో సహా అందరూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి వారి నుంచి వచ్చిన నీటి సరఫరా తదితర సమస్యలకు వెంటనే స్పందించాలని ఆదేశించారు. శివారు ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నందున అసిస్టెంట్ ఇంజనీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ప్రతి ఇంటికి మంచినీరు తగు రీతిన అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు

నాగులుప్పలపాడు: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఏ రాజకీయ పార్టీ కార్యకర్తలు, నాయకులు అయినా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ ఎస్పీ, ఎన్నికల ప్రత్యేకాధికారి రవి వర్మ అన్నారు. ఫలితాల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు తావులేకుండా ముందస్తు చర్యలుగా మంగళవారం మండలంలోని తిమ్మ సముద్రం, ముప్పాళ్ళ, ఉప్పుగుండూరు, మాచవరం గ్రామాల్లో ఒంగోలు రూరల్ సీఐ అజయ్ కుమార్, నాగులుప్పలపాడు ఎస్సై బ్రహ్మనాయుడుతో కలిసి పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి రాజకీయ పార్టీల నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామని ఫలితాల దృష్ట్యా కవ్వింపు చర్యలకు, విజయోత్సవాలకు అనుమతి లేదన్నారు.


తిమ్మసముద్రం గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రవి వర్మ

మద్దిపాడు మండలంలో..

మండల పరిధిలోని లింగంగుంట, పెదకొత్తపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ, ఎన్నికల ప్రత్యేకాధికారి రవి వర్మ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పాత నేరస్తులు, రౌడీ షీటర్లతో మాట్లాడి హెచ్చరికలు జారీ చేశారు.

శిక్షణ శిబిరాలతో సాంకేతిక విజ్ఞానం

కొత్తపట్నం: వేసవి సెలవుల్లో విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో సాంకేతిక విజ్ఞానం నేర్చుకుంటున్నారని స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. గ్రంథాలయంలో వేసవి సెలవుల నుంచి శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయి. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు రావడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో రోజు రోజుకు కొత్త పుస్తకాలు రక రకాల విషయాలు నేర్చుకోవచ్చునన్నారు. తెలుగు భాష, అమ్మ భాష వంటిదని తెలిపారు. కొంత మంది కవులు గురించి వారు రాసిన తెలుగు పద్యాల గురించి వివరించారు. పద్యం అర్థాలు, భావం పద్య రూపంలో పాడి వినిపించాడు. విద్యార్థులకు చిన్న చిన్న ప్రశ్నల ద్వారా జావాబులు రాబట్టం చాలా ఆసక్తికరంగా జరిగింది. కొందరు కవులు చిత్రపటాలు గురజాడ అప్పారావు, ఎర్రన్న, గిడుగు వెంకట్ రామమూర్తి వారి చిత్రాలను చూపించి వారి గురించి వివరించారు. పురిణి శ్రీను గణితం మీద గమ్మత్తయిన పజిల్స్ విద్యార్థులకు చూపించి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ఒక విద్యార్థి తన టాలెంట్‌తో ఒక కూలర్ తయారు చేసి ప్రజెంటేషన్ ఇచ్చాడు. ఈ వేసవి సెలవుల్లో ప్రతి విద్యార్థి వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, దానికి తల్లిదండ్రులు కూడా వారి పిల్లలు గ్రంథాలయాలకు వెళ్లే విధంగా ప్రోత్సహించాలని కోరారు. గ్రంథపాలకుడు సీహెచ్ అజయ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొత్తపట్నంలో కవుల గురించి వివరిస్తున్న కోటేశ్వరరావు

బాలికలు పరిశుభ్రత అలవరచుకోవాలి


మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి

ఒంగోలు రూరల్: చిన్ననాటి నుంచి బాలికలు అత్యంత పరిశుభ్రతను నేర్చుకోవటం ద్వారా మంచి ఆరోగ్యం కలిగి ఉంటారని కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎస్.వాణి అన్నారు. ఆరోగ్య పరిశుభ్రత దినోత్సవ సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎలిమెంటరీ, హైస్కూల్ విద్యార్థులు, వ్యవసాయ పనులకు వచ్చిన బాలికలకు ఇటుక రాయి పరిశ్రమల్లోని బాలికలందరితో సమావేశం ఏర్పాటు చేశారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ పురుషుల కంటే బాలికలల్లో అనేక శారీరక మార్పులు క్రమంగా జరుగుతుంటాయని, అలాంటి సమయంలో పూర్తి రక్షణ కలిగిన విధానాలు పాటించాలని ఇందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, ఈ మధ్య పాఠశాలల్లో హైజీన్ నాప్కిన్స్ అందుబాటులో ఉంచుకున్నారని, మెడికల్ శాఖ ద్వారా ఏఎన్ఎం, ఆశా, ఇతర సిబ్బంది బాలికల కౌమార దశ, వివాహసమయం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారు తెలియజేస్తారని తెలిపారు. బాలికల చిన్ననాటి నుంచి పూర్తి మహిళలగా రూపుదిద్దుకునే వరకు వివాహం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ సందర్భంగా స్టేజీల వారీగా మెడికల్ ఆఫీసర్ వివరంగా వివరించారు. ఎస్ఎన్‌లు, ఏఎన్ఎమ్‌లు కృష్ణవేణి, సుబ్బమ్మ, సరితాకుమారి, ఆశలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లు 3052

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి ఈనెల 27వ తేదీ నాటికి మొత్తం 3052 పోస్టల్ బ్యాలెట్లు వచ్చినట్లు సబ్‌కలెక్టర్, ఆర్‌ఓ రాహుల్‌మీనా మంగళవారం తెలిపారు. ఇందులో ఎన్నికల డ్యూటీ, పీఓలు, ఏపీఓలు, పోలీసు, సెక్టార్ ఆఫీసర్స్ తదితర విభాగాలకు చెందిన వారు 2351 మంది, ఎసెన్షియల్ సర్వీసెస్ కింద 244 మంది, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎన్నికల డ్యూటీ చేసిన వారు 153 మంది, ఇంటర్ డిస్ట్రిక్ట్ ఎసెన్షియల్ సర్వీస్ విభాగంలో 18 మంది, హోమ్ ఓటింగులో 169 మంది, సర్వీసు ఓటర్లు 117 మంది మొత్తం 3052 మంది పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.

పెరిగిన దేవస్థాన భూముల కౌలు వేలం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు దేవదాయ ధర్మాధాయ దేవస్థానం భూముల కౌలు వేలం పాటలు గతం కన్నా ఈ ఏడాది రూ. 5.27 లక్షలు పెరిగింది. శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో నిర్వహించిన కౌలు వేలం పాటలో శ్రీ వేణుగోపాల ఆళ్వారాజుల దేవస్థానం సంబంధించి 52.89 సెంట్లకు పాట నిర్వహించారు. గతంలో రూ. 9,54,100 ఆదాయం రాగా ఈ ఏడాది ప్రస్తుతం రూ. 1330500 వచ్చింది. అదే విధంగా శ్రీ గౌరీశ్వర స్వామి దేవస్థానంకు సంబంధించి 24.89 సెంట్లకు కౌలు వేలం పాట నిర్వహించగా గతంలో రూ. 349000 రాగా ప్రస్తుతం 494000 రూపాయలు వచ్చింది. అలాగే శ్రీ సుబ్రమణ్వేశ్వర స్వామి దేవస్థానం, ఊర చెరువు పాటల్లో కూడా ఆదాయం పెరగడంతో గతం కన్నా మెత్తం మీద రూ. 5.27 లక్షలు ఆదాయం పెరిగినట్లు అధికారులు తెలిపారు. వేలం పాటలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణు గోపాల్, ఈవోలు మీనిశెట్టి శ్రీనివాసరావు, కావూరి శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సామూహిక సుమంగళి పూజ


ప్రత్యేక అలంకణలో గుంటి గంగాభవానీ అమ్మవారు


సామూహిక సుమంగళి పూజలో భక్తులు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం గుంటిగంగా భవానీ అమ్మవారి ఆలయంలో మంగళవారం సామూహిక సుమంగళి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో సుమంగళి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారులు బాలరాజు, కామేశ్వరరావు, ప్రకాశరావులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కార్తీక్ భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల

కురిచేడు: పల్నాడు, ప్రకాశం జిల్లాల సరిహద్దులోని నరసాయపాలెం పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా వైశాఖ బహుళ తదియ నాడు అమ్మవారి తిరునాల జరగటం ఆనవాయితీగా మారింది. పూర్వం ఇక్కడ నరసాయపాలెం అనే గ్రామం ఉండేది. గ్రామం కాలక్రమంలో ఖాళీ అయిపోయినా అమ్మవారి ఆలయం అక్కడే ఉండి నేటికీ పూజలందుకుంటోంది. ప్రతి ఆదివారం భకుల్తు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకోవటం పరిపాటయింది. తిరునాళ్ల సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి చేరి పొంగళ్లు నైవేద్యం చేసి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. గొర్రెలు, ట్రాక్టర్లను ఆ చుట్టుపక్కల గ్రామాల వారు ఆలయం చుట్టూప్రదక్షిణలు చేయించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం నరసాయపాలెం పోలేరమ్మ అని ఇక్కడ భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తుల సౌకర్యార్థం తాగు నీరు, అన్నదానం నిర్వహకులు ఏర్పాటు చేశారు.


పొంగళ్లు తయారు చేస్తున్న మహిళలు

విద్యాచైతన్య ప్రచారోద్యమం


పిల్లలు, తల్లిదండ్రులతో నాగమణి

కురిచేడు: మండలంలోని రామాంజనేయకాలనీలో మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యాచైతన్య ప్రచార ఉద్యమం నిర్వహించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ దర్శి నియోజకవర్గ కన్వీనరు గుంటూరు నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ లక్ష్మి, ఏఎన్ఎం వి. పద్మావతి పాల్గొన్నారు. ఏఎన్ఎం పద్మావతి మాట్లాడుతూ బడికి వెళ్లడం పిల్లల హక్కు, చదివించటం అందరి బాధ్యత అనే నినాదంతో పిల్లలకు,తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చదువుకుంటే జ్ఞానం, నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని పద్మావతి తెలిపారు. తన మీద తనకు నమ్మకం పెరుగుతుందని, జీవితానికి భద్రత, భరోసా చదువు ఉంటుందన్నారు. బడిమానేసిన పిల్లలు, బడిబయట తిరిగేవారు బడిలోపలికి రీ ఓపెనింగ్ సమయంలో బడికి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, వసతిదీవెన, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు మరెన్నో ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందని అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తెలిపారు. పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

తర్లుపాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు గుర్తించేందుకు గాను ముందస్తు జాగ్రత్తగా మండలంలోని పోతలపాడు, తుమ్మలచెరువు, మీర్జాపేట, బుడ్డపల్లి గ్రామాల్లో ఎస్సై వేముల సుధాకర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో కవ్వింపు చర్యలకు పాల్పడే వారిని సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ర్యాలీలకు అనుమతులు లేవని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఉద్రిక్తతలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనుమానిత వ్యక్తులు, అల్లర్లకు పాల్పడే వారిపై నేరుగా తనకు గానీ, డయల్ 100కు గానీ సమాచారం అందించాలని కోరారు.

జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలి


వలలు అందజేస్తున్న డీబీఆర్‌సీ ప్రతినిధులు

తాళ్లూరు (ముండ్లమూరు): సంచార జీవనానికి స్వస్తి పలికి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపరుచు కోవాలని దళిత బహుజ రీసోర్స్ సెంటర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రమణమూర్తి అన్నారు. మండలంలోని తూర్పుగంగవరంలో చెంచుకాలనీ, తాళ్లూరు ఎస్టీ కాలనీల్లో పలువురికి వలలు, వ్యాపారం కోసం ప్లాస్టిక్ వస్తువులను మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభత్వాలు వేస్ట్ పిక్కర్స్ (రోడ్ల వెంబడి చెత్తకాగితాలు ఏరుకునే వారు) ద్వారా సంచార జాతుల వారికి రాయితీతో కూడిన వివిధ రకాల పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అందులో భాగంగా సంచార జాతుల అభివృద్ధికి డీబీఆర్‌సీ తమ వంతు సాయంగా చేపలు పట్టే వారికి వలలు, ప్లాస్టిక్ వస్తువులు అమ్మే వారికి సంబంధిత వస్తువులు ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో ఆత్మగౌరవంతో జీవనం సాగించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభత్వాలు అమలు చేస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. సంచార వృత్తికి స్వస్తి పలికి తమ కాళ్లపై తాము నిలబడేలా డీబీఆర్‌సీ అండగా ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీబీఆర్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కో ఆర్డినేటర్ గోపనబోయిన వెంకటరావు, ఆయా కాలనీల పెద్దలు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ఉపాధి పనులు


ఫారం పాండ్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు

పుల్లలచెరువు: పశ్చిమ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యంలో ఉపాధి పనులు జలాలు పెంపే లక్ష్యంగా పనిచేయాలని డ్వామా పీడీ అర్జునరావు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పుల్లలచెరువులో ఫారం పాండ్‌ను సందర్శించి అనంతరం సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో రైతులకు ఫారం పాండ్ ఉపయోగాలు తెలియజేసి వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రైతు పొలంలో ఫార పాండ్ ఉండే విధంగా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధం చూపాలన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉద్యాన వన పంటలు సాగు చేసేందుకు 250 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటేందుకు ప్రతి టీఏకు 50 ఎకరాలు నిర్దేశిత లక్ష్యాలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున రహదారుల పక్కన మొక్కలు నాటేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. 25 హెక్టార్లలో పరిధిలో కొండ కందకాల్లో గడ్డి విత్తనాలు చల్లాలని ఆదేశించారు. సిబ్బంది సక్రమంగా పనిచేయాలన్నారు. ఆరోపణలు వస్తే చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు. ఈయన వెంట ఎంపీడీవో విలియమ్స్, ఏపీవో శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

కార్డెన్ సెర్చ్‌లో వాహనాలు సీజ్

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లెలో మంగళవారం త్రిపురాంతకం సీఐ సూరేపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేశారు. గ్రామంలో రికార్డులు లేని 8 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ సుబ్బారావు గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గుర్తుతెలియని వారు ఎవరైనా వాహనాలు విక్రయిస్తే కొనుగోలు చేయకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామంలోకి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కురిచేడు, దొనకొండ, త్రిపురాంతకం ఎస్సైలు శ్రీకాంత్, సంపత్‌కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి రథోత్సవం


రథంపై ఆశీనులైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలుడు

యర్రగొండపాలెం: రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మిల్లంపల్లిలోని స్వామి ఆలయం నుంచి యర్రగొండపాలెం పట్టణంలోని ప్రధాన వీధుల్లో సాగిన రథోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. స్వామి రథాన్ని మహిళా భక్తులు లాగి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, పెద్దకాపు వెంకటరెడ్డి పాల్గొని రథోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వేణుగోపాలుడి రథం లాగుతున్న మహిళలు